అధికారులు చిత్తశుద్ధితో పనిచేయాలి

మాట్లాడుతున్న అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ

కంఠేశ్వర్, సెప్టెంబర్ 3 : నగర అభివృద్ధికి అధికారులు చిత్తశుద్ధితో పనిచేయాలని అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ అన్నారు. నగరంలోని మున్సిపల్ కార్యాలయంలో నగరపాలక కమిషనర్‌తో పాటు వివిధ శాఖల అధికారులతో మంగళవారం సమావేశం నిర్వహించి మాట్లాడారు. రెవెన్యూ, ఇంజినీరింగ్, టౌన్ ప్లానింగ్, శానిటేషన్ విభాగాలపై ప్రజల నుంచి అనేక ఫిర్యాదులు వస్తున్నాయని అన్నారు. నగరంలో రోడ్లు, డ్రైనేజీలు, శానిటేషన్ విషయంలో మొదటి నుంచి హెచ్చరించినా అధికారులు పట్టించుకోలేదని, వానాకాలానికి ముందే కనీసం గుంతలనైనా పూడ్చలేదని అధికారులపై మండిపడ్డారు. మున్సిపల్‌కు వచ్చే ప్రతి పైసా నగర అభివృద్ధి ఉపయోగించాలని సూచించారు. వర్షాల నేపథ్యంలో అధికారులు అప్రమత్తంగా ఉండాలని, వర్షి రోడ్డులో డ్రైనేజీలో ఓ చిన్నారి ఇటీవల గల్లంతైన ఘటన దారుణమన్నారు. ఘటనలు పునరావృతం కాకుండా చర్యలు చేపట్టాలని అన్నారు. నగరంలో రోడ్లపైనే వాహనాలు పార్కింగ్ చేయడంతో ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం కలుగుతోందని, వ్యాపారసముదాయాలపై చర్యలు తీసుకోవాలని సూచించారు. సమావేశంలో మున్సిపల్ అసిస్టెంట్ కమిషనర్ శంకర్, మేనేజర్ జనార్దన్, టౌన్ ప్లానింగ్ ఆఫీసర్ సత్యనారాయణ, మున్సిపల్ ఎంఈ మురళి తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ వినియోగదారులకు మెరుగైన సేవలు అందించాలి

- వరంగల్ చీఫ్ ఇంజినీర్ అశోక్

సమావేశంలో మాట్లాడుతున్న వరంగల్ చీఫ్ ఇంజినీర్ అశోక్

ఖలీల్‌వాడి, సెప్టెంబర్ 3 : విద్యుత్ వినియోగదారులకు మెరుగైన సేవలందించాలని వరంగల్ చీఫ్ ఇంజినీర్ అశోక్ అన్నారు. వర్ని చౌరస్తాలోని విద్యుత్ భవన్‌లో ఏడీ, ఏఈలతో మంగళవారం సమావేశం నిర్వహించి మాట్లాడారు. భారీ వర్షాల్లోనూ ఎలాంటి నష్టం జరగకుండా, విద్యుత్ సరఫరా అందిస్తున్న అధికారులు, సిబ్బందిని అభినందించారు. నగరంలో 11కేవీ లైన్లలో రింగ్ మెయిన్స్ ఏర్పాటు చేయడానికి చేపట్టాల్సిన చర్యలపై సూచనలు చేశారు. ఈనెల 17 నుంచి ప్రజా పాలన కార్యక్రమంలో పాల్గొనాలని అన్నారు. సమావేశంలో డీఎం శ్రీనివాస్, ఏడీలు చంద్రశేఖర్, తోట రాజశేఖర్, వీరేశం, ప్రశాంత్‌రెడ్డి, ప్రసాద్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ముగ్గురు సూపరింటెండెంట్లకు ఎంపీడీవోగా అధనపు బాధ్యతలు

కోటగిరి, సెప్టెంబర్ 3 : జిల్లాలోని వివిధ మండలాల్లో సూపరింటెండెంట్లుగా విధులు నిర్వర్తిస్తున్న ముగ్గురికి ఇన్‌చార్జి ఎంపీడీవోలుగా అదనపు బాధ్యతలు అప్పగిస్తూ రాష్ట్ర పంచాయతీ రాజ్ శాఖ కమిషనర్ ఈ నెల 2వ తేదీన ఉత్తర్వులు జారీచేశారు. కోటగిరి ఎంపీడీవో కార్యాలయ సూపరింటెండెంట్ శ్రీనివాస్‌రెడ్డి, ధర్పల్లి సూపరింటెండెంట్ ప్రవీణ్‌రెడ్డి, కోటగిరి ఎంపీడీవోగా పనిచేసి.. ప్రస్తుతం సెలవులో ఉన్న కేఆర్ మనోహర్‌రెడ్డికి ఎంపీడీవోగా బాధ్యతలు ఇవ్వనున్నారు. కోటగిరికి శ్రీనివాస్‌రెడ్డి, మోస్రాకు ప్రవీణ్‌రెడ్డి, సిరికొండకు కేఆర్. మనోహర్‌రెడ్డికి ఎంపీడీవో బాధ్యతలు అప్పగిస్తూ జడ్పీ సీఈవో ఉత్తర్వులు జారీ చేశారు.

9న పీజీ పరీక్షల నిర్వహణ

డిచ్‌పల్లి, సెప్టెంబర్ 3 : జిల్లావ్యాప్తంగా భారీ వర్షాల నేపథ్యంలో ఈనెల 2న వాయిదా వేసిన పీజీ పరీక్షలను ఈనెల 9వ తేదీన నిర్వహించనున్నట్లు పరీక్షల నియంత్రణాధికారిణి ఆచార్య అరుణ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. వాయిదా వేసిన పీజీ రెండో సెమిస్టర్, ఇంటిగ్రేటెడ్ కోర్సు 8వ సెమిస్టర్ రెగ్యులర్, బ్యాక్‌లాగ్, బీఎల్ఐఎస్సీ రెండో సెమిస్టర్ బ్యాక్‌లాగ్ పరీక్షలను నిర్వహించనున్నట్లు వివరించారు.

నగరంలో మున్సిపల్ కమిషనర్ పర్యటన

కంఠేశ్వర్, సెప్టెంబర్ 3 : నగరంలో మున్సిపల్ కమిషనర్ మకరంద్ మంగళవారం పర్యటించారు. 20వ డివిజన్‌లో డెంగీ బారిన పడిన వ్యక్తి ఇంటితోపాటు పరిసరాలను పరిశీలించారు. 19వ డివిజన్‌లో వర్షాలకు గుంతలు పడిన రోడ్లను పరిశీలించి, అధికారులకు పలు సూచనలు చేశారు.

బాధిత కుటుంబానికి ఆర్థిక సాయం

ఆర్థిక సాయం అందజేస్తున్న భీమ్‌గల్ యువకులు

భీమ్‌గల్, సెప్టెంబర్ 3: మండలంలోని బాబాపూర్ గ్రామానికి చెందిన ఎల్లుల్ల రితిక్ రెండేండ్ల నుంచి అనారోగ్యంతో బాధపడుతుండడంతో భీమ్‌గల్‌కు చెందిన 2006-07 పదో తరగతి విద్యార్థులు, భీమ్‌గల్ సెల్‌పాయింట్ యూనియన్ ప్రతినిధులు కలిసి వైద్య ఖర్చుల నిమిత్తం రూ.61,050 సాయం మంగళవారం అందించారు. తమ కుమారుడిని కాపాడాలంటూ ఇటీవల బాలుడి తల్లిదండ్రులు ఎల్లుల్ల అనూష, సురేశ్ సోషల్‌మీడియా ద్వారా కోరడంతో యువకులు స్పందించారు.

సాలూరా మండల కేంద్రంలో..

బోధన్ రూరల్, సెప్టెంబర్ 3: సాలూరా మండల కేంద్రంలో రెండు రోజుల క్రితం గ్యాస్ సిలిండర్ పేలి ఆస్తి నష్టంవాటిల్లగా బాధిత కుటుంబానికి ముదిరాజ్ సంఘం నాయకులు మంగళవారం 70 కిలోల బియ్యం, రూ.16300 అందజేశారు. కార్యక్రమంలో గ్రామస్తులు, ముదిరాజ్ సంఘం నాయకులు పాల్గొన్నారు.

తగ్గని వర్షం

- పారుతున్న అలుగులు..
- పొంగి ప్రవహిస్తున్న వాగులు
- రోడ్లపై నిలిచిన వర్షపు నీరు
- పలు చోట్ల కూలిన ఇండ్లు.. దెబ్బతిన్న రోడ్లు

అలుగు పారుతున్న రూరల్ మండలంలోని గుండారం చెరువు

తిమ్మాపూర్‌లో కూలిన ఇల్లు

నమస్తే తెలంగాణ యంత్రాంగం, సెప్టెంబర్ 3 : నాలుగు రోజులుగా ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షానికి జిల్లా తడిసి ముద్దయ్యింది. చెరువులన్నీ జలకళను సంతరించుకున్నాయి. అలుగులు పారుతున్నాయి. వాగులు పొంగి ప్రవహిస్తున్నాయి. పలు చోట్ల శిథిలావస్థలో ఉన్న ఇండ్లు కూలిపోయాయి. రోడ్లు ధ్వంసమై వర్షపు నీరు నిల్వడంతో ప్రయాణికులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

కోటగిరి మండలంలోని ఎత్తొండ- వల్లభాపూర్ రోడ్డు పూర్తిగా దెబ్బతిన్నది. రోడ్డుపై పెద్ద పెద్ద గుంతలు ఏర్పడి, వర్షపు నీరు నిల్వ ఉండడంతో ప్రయాణికులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. మూడరెండు ఇండ్లు, ఎత్తొండలో ఒక ఇల్లు కూలినట్లు గిర్దావర్ సయ్యద్ హుస్సేన్ తెలిపారు. శిథిలావస్థకు చేరిన ఇండ్లలో నివాసం ఉండవద్దని సూచించారు. భారీ వర్షాలకు ఇండ్లు కూలిపోయిన, వ్యక్తులు, పశువులు మృతిచెందిన, పంట దెబ్బతిన్న బాధితులు దరఖాస్తు చేసుకోవాలని రెవెన్యూ అధికారులు సూచించారు.

పొతంగల్ మండలకేంద్రంతోపాటు సుంకిని, కొల్లూర్, హెగ్డోలి, హంగర్గాఫారంలో ఆర్ఐ సాయిలు, జీపీ సిబ్బంది పర్యటించి, పాక్షికంగా కూలిన, శిథిలావస్థలో ఉన్న ఇండ్లను పరిశీలించారు. అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఆర్ఐ సాయిలు, గ్రామ పంచాయతీ సిబ్బంది తదితరులు ఉన్నారు.

డిచ్‌పల్లి మండంలోని ఖిల్లా డిచ్‌పల్లి చెరువు, ధర్పల్లి మండల కేంద్రంలోని పెద్ద చెరువు చెరువు అలుగు పారుతున్నాయి. మొన్నటివరకు ఎండిపోయిన పెద్దచెరువు అలుగుపారుతుండడంపై పంటలకు ఢోకా లేదని ధర్పల్లి, సీతాయిపేట్ గ్రామాల రైతులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. పెద్ద చెరువు వద్ద గ్రామ ప్రత్యేకాధికారి, ఎంపీడీవో బాలకృష్ణ, కార్యదర్శి సైపుద్దీన్, తహసీల్దార్ మాలతి, రైతులు, నాయకులు చెరువు వద్ద పూజలు చేశారు.

రుద్రూర్ మండలం సులేమాన్‌నగర్‌లో ఎస్సై సాయన్న, కానిస్టేబుల్ అమీర్ పర్యటించి, ప్రమాదాల బారిన పడకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలను ప్రజలకు వివరించి, అప్రమత్తం చేశారు. నాలుగు రోజులుగా కురుస్తున్న వర్షాలకు రుద్రూర్ మండలంలోని రాణంపల్లిలో మూడు ఇండ్లు దెబ్బతిన్నట్లు ఆర్ఐ నజీర్, ఎంపీడీవో సురేశ్‌బాబు తెలిపారు. శిథిలావస్థకు చేరిన ఇండ్లలో ఉంటున్న వారికి పునరావాసం కల్పించారు. కార్యదర్శులు అప్రమత్తంగా ఉండాలని, ప్రమాదాల బారిన పడకుండా ప్రజలకు అవగాహన కల్పించాలని ఎంపీడీవో సురేశ్‌బాబు సూచించారు. రుద్రూర్ గ్రామ శివారులో వరి పంట నీట మునిగింది. సిరికొండ మండలంలోని గడ్డమీది తండా, తూంపల్లి, పాకాల, వర్జన్ తండాలో పంచాయతీ ఎస్ఈ ప్రభాకర్, ఈఈ శంకర్, డీఈ హైమద్ హుస్సేన్ పర్యటించి, ధ్వంసమైన రోడ్లను పరిశీలించారు.

నగరంలో 106 ఇండ్లకు నోటీసులు

కంఠేశ్వర్, సెప్టెంబర్ 3 : జిల్లాలోని వివిధ ప్రాంతాల్లో శిథిలావస్థకు చేరిన 106 ఇండ్లకు నోటీసులు అందజేసినట్లు టౌన్‌ప్లానింగ్ అధికారి సత్యనారాయణ తెలిపారు. శిథిలావస్థకు చేరిన ఇండ్ల వివరాలను తమకు అందజేయాలని కోరారు. పురాతన ఇండ్లల్లో ఉంటున్న వారికి సురక్షిత ప్రాంతాలకు తరలించేందుకు చర్యలు చేపట్టారు.

రైతులకు పరిహారం అందించాలి

భారీ వర్షాల కారణంగా పంటలు కోల్పోయిన రైతులు, ఇండ్లు కోల్పోయిన పేదలకు ప్రభుత్వం నష్టపరిహారం అందించాలని సీపీఎం జిల్లా కార్యదర్శి రమేశ్‌బాబు డిమాండ్ చేశారు. పార్టీ కార్యాలయంలో మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. దెబ్బతిన్న రోడ్లకు మరమ్మతులు చేపట్టాలని కోరారు.

మోర్తాడ్ మండలం తిమ్మాపూర్ గ్రామంలో గుర్రం లక్ష్మికి చెందిన ఇల్లు కూలింది. అంతకు ముందే భోజనం కోసం లక్ష్మి తన కుమారుడి ఇంటికి వెళ్లడంతో ప్రమాదం తప్పింది. పరిహారం ఇప్పించాలని బాధితురాలు కోరింది. మోర్తాడ్‌లో ఆరు ఇండ్లు పాక్షికంగా దెబ్బతిన్నాయని, పరిహారం కోసం నివేదిక పంపించామని తహసీల్దార్ సత్యనారాయణ తెలిపారు.

మోర్తాడ్, కమ్మర్‌పల్లి మండలకేంద్రాల్లో లోతట్టు ప్రాంతాలన్నీ జలమయమవుతున్నాయి. ఇండ్లకు వెళ్లే రోడ్లపై వర్షపునీరు నిలిచింది. దోమలు పెరిగి అనారోగ్యాల బారిన పడే ప్రమాదం ఉందని, మురికికాలువల ద్వారా నీరు వెళ్లేలా చర్యలు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.

మంజీరాలో కోనసాగుతున్న వరద

సాలూర వద్ద మంజీరా నదిలో వరద కొనసాగుతోంది. బోధన్ మండలంలోని మంజీరా పరివాహక ప్రాంతంలోని హంగర్గ గ్రామాన్ని బోధన్ ఆర్డీవో రాజేశ్వర్, బోధన్ తహసీల్దార్ విఠల్, జిల్లా పంచాయతీ అధికారి తరుణ్‌కుమార్, ఇన్‌చార్జి ఏడీఏ సంతోష్‌నాయక్ సందర్శించారు. మంగళవారం ఉదయం వరకు బోధన్ డివిజన్‌లోని రెంజల్ మండలంలో 7.2 మిల్లీ మీటర్లు, కోటగిరి మండలంలో13 మిల్లీ మీటర్లు, బోధన్ మండలంలో 14.8, వర్ని మండలంలో 14.6, మోస్రా మండలంలో 18, ఎడపల్లి మండలంలో 15.8, రుద్రూర్ మండలంలో 16.2, చందూర్ మండలంలో 15.2 మిల్లీ మీటర్ల వర్షపాతం నమోదైనట్లు రెవెన్యూ అధికారులు వెల్లడించారు. నవీపేట మండలంలోని హన్మాన్‌ఫారం సమీపంలో నందిపేట్- నవీపేట రోడ్డుపై భారీ వృక్షం నేలకొరిగింది. ఎంపీవో రామకృష్ణ, ఎస్సై వినయ్, తాజా మాజీ సర్పంచ్ వంశీకృష్ణ, ఆర్‌అండ్‌బీ ఈఈ స్థానిక గ్రామ పంచాయతీ కార్యదర్శి రాజగంగు సంఘటనా స్థలానికి వెళ్లి చెట్టును జేసీబీతో తొలగింపజేశారు. నవీపేట మండలంలోని తుంగిని, మోకన్‌పల్లి చెరవుల అలుగులు పారుతున్నాయి. రెంజల్ మండలం కందకుర్తి సమీపంలోని గోదావరి, మంజీరా, హరిద్రా, నదుల నుంచి వరద కొనసాగుతోంది. వంతెనను తాకుతూ గోదావరిలో వరద పారుతోంది. రెండు రోజులుగా పురాతన శివాలయం, వీఐపీ పుష్కర ఘాట్ రోడ్డు మార్గం నీటిలో మునిగాయి. సాటాపూర్, కందకుర్తి -ధర్మాబాద్ మహారాష్ట్ర ప్రధాన రోడ్డును రెంజల్ పోలీసులు మూసివేశారు. ధర్మాబాద్ వరకు నడిచే బోధన్ డిపో బస్సు లను ఆర్టీసీ అధికారులు కందకుర్తి వరకే నడుపుతున్నారు. రెంజల్ మండలం కందకుర్తి గోదావరినదిలో వరద ఉధృతిని బోధన్ ఆర్టీవో అంబాదాస్ రాజేశ్వర్ మండల అధికారులతో కలిసి పరిశీలించారు. ఆయన వెం ఎంపీడీవో శ్రీనివాస్, తహసీల్దార్ శ్రావణ్, ఎస్సై సాయన్న, ఎంపీవో రఫియుద్దీన్, గిర్దావర్ రవికుమార్, కార్యదర్శి సతీశ్‌చంద్ర తదితరులు ఉన్నారు.

మాక్లూర్ మండలంలోని మానిక్‌బండార్ వద్ద 63వ జాతీయ రహదారిపై వర్షం నీరు ప్రవహించ కుండా అధికారులు చర్యలు చేపట్టారు. జేసీబీ సహాయంతో పక్కనే ఉన్న కాల్వలోకి నీటిని మళ్లించి వాహనాల రాకపోకలకు ఇబ్బంది కలగకుండా ఏర్పాట్లు చేశారు. ట్రాఫిక్ ఏసీపీ నారాయణ ఆదేశాల మేరకు చర్యలు చేపట్టామని ఎస్సై రాజశేఖర్ తెలిపారు. పోలీసు సిబ్బంది, ఇరిగేషన్ అధికారులు, రెవెన్యూ అధికారులు పాల్గొన్నారు.

ఎత్తొండ-వల్లభాపూర్ రోడ్డుపై ఏర్పడిన గుంతలు

నాగారంలో పురాతన ఇంటికి నోటీసులు అతికిస్తున్న సిబ్బంది

ధర్పల్లి చెరువు వద్ద పూజలు చేస్తున్న అధికారులు, రైతులు, నాయకులు

పండుగలు శాంతియుతంగా జరుపుకోవాలి

మాట్లాడుతున్న బోధన్ ఏసీపీ శ్రీనివాస్

వినాయక్‌నగర్/ జక్రాన్‌పల్లి/ శక్కర్‌నగర్/ మాక్లూర్ సెప్టెంబర్ 3: ఈనెల 7న ప్రారంభం కానున్న గణేశ్ నవరాత్రి ఉత్సవాలను ప్రజలు శాంతియుతంగా జరుపుకోవాలని పోలీసు అధికారులు మండపాల నిర్వాహకులకు సూచించారు. ప్రశాంతంగా, కలిసికట్టుగా జరుపుకోవాలని సీపీ కల్మేశ్వర్ మంగళవారం ఒక ప్రకటనలో సూచించారు. వివిధ మండలాలు, గ్రామాల్లో పోలీసులు శాంతి కమిటీ సమావేశాలు నిర్వహించి సూచనలుచేశారు. http://police portal.tspolice.gov.in వెబ్‌సైట్‌లో గణేశ్ మండపాల వివరాలను నమోదు చేసుకోవాలని, అనుమతులు తీసుకోవాలని, నిర్వాహకులు జాగ్రత్తలు పాటిస్తూ ఇతరులకు ఇబ్బందులు కలుగకుండా చూడాలని అన్నారు. నగరంలోని తన కార్యాలయంలో సీఐ నరహరి సమావేశం నిర్వహించి మాట్లాడారు. డీజేలకు అనుమతిలేదని స్పష్టం చేశారు. స్పీకర్లు, మైకుల ఏర్పాటుకు పోలీసుల అనుమతి తీసుకోవాలన్నారు. ఆరో టౌన్ పోలీస్‌స్టేషన్‌లో నిజామాబాద్ సౌత్ రూరల్ సీఐ సురేశ్, రెండో టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలో ఎస్సై యాసిర్ అరాఫత్, త్రీటౌన్ పరిధిలో ఎస్సై మహేశ్, ఆరో టౌన్ పరిధిలో ఎస్సై వెంకట్రావు, డిచ్‌పల్లి మండలంలోని వివిధ గ్రామాల వారితో సీఐ మల్లేశ్, ఎస్సై తిరుపతి, ఏఎస్సై సుశీల్‌కుమార్ శాంతి కమిటీ సమావేశాలు నిర్వహించారు. మండపాల వద్ద తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు.

బోధన్‌లో వినాయక నవరాత్రి ఉత్సవాలను ప్రశాంతంగా జరుపుకోవాలని బోధన్ ఏసీపీ శ్రీనివాస్ సూచించారు. బోధన్ పట్టణంలో ఏర్పాటు చేసిన శాంతి కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడారు. కార్యక్రమంలో సార్వజనిక్ గణేశ్ ఉత్సవ కమిటీ అధ్యక్షుడు, కౌన్సిలర్ కందుకాల శ్రీకాంత్ గౌడ్, బోధన్ పట్టణ సీఐ సంద్ర వీరయ్య, ఎస్సై హబీబ్ ఖాన్, మున్సిపల్ కమిషనర్ వెంకట నారాయణ, విద్యుత్‌శాఖ డీఈ ముక్తార్, మున్సిపల్ ఏఈ శ్రీనివాస్, నాయకులు పాల్గొన్నారు.

మాక్లూర్‌లో నిర్వహించిన శాంతికమిటీ సమావేశంలో రూరల్ సీఐ సతీశ్ మాట్లాడారు. గణేశ్ నవరాత్రులను శాంతియుతంగా జరుపుకోవాలని సూచించారు. ఎస్సై రాజశేఖర్, ఆయా పార్టీల నాయకులు పాల్గొన్నారు.

'అధికారులు అప్రమత్తంగా ఉండాలి'

కలెక్టర్ హన్మంతు, సీపీ కల్మేశ్వర్‌తో కలిసి ఎస్సారెస్పీని పరిశీలిస్తున్న బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డి

మోర్తాడ్/ఆర్మూర్‌టౌన్/భీమ్‌గల్, సెప్టెంబర్ 3: భారీ వర్షాల నేపథ్యంలో అధికార యంత్రాంగం అప్రమత్తంగా ఉండాలని, గోదావరి పరీవాహక ప్రాంతాల ప్రజలకు ఇబ్బందులు కలగకుండా చూడాలని బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డి అధికారులకు సూచించారు. మంగళవారం ఎస్సారెస్పీని కలెక్టర్ రాజీవ్‌గాంధీ హన్మంతు, సీపీ కల్మేశ్వర్ తో కలిసి ఆయన పరిశీలించారు. అనంతరం జలవిద్యుత్ ఉత్పత్తి కేంద్రాన్ని సందర్శించారు. ఈకేంద్రంలో నాలుగు యూనిట్ల ద్వారా 27 మెగావాట్ల విద్యుత్ ఉత్పత్తి జరుగుతుండడం సంతోషకరమన్నారు. ఆయన వెంట కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు మానాల మోహన్‌రెడ్డి, నాయకులు తాహెర్‌బిన్ హందాన్, అన్వేశ్‌రెడ్డి, గడుగు గంగాధర్, నర్సారెడ్డి, ఇరిగేషన్, జెన్‌కో అధికారులు పాల్గొన్నారు.

పునరావాస కేంద్రాలకు తరలించాలి

భారీ వర్షాలు కురుస్తున్నందున శిథిలావస్థలో ఉన్న ఇండ్లలో ఉంటున్న వారిని పునరావాస కేంద్రాలకు తరలించాలని బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డి అన్నారు. ఆర్మూర్ మున్సిపల్ కార్యాలయంలో కలెక్టర్ రాజీవ్ గాంధీ హన్మంతు, సీపీ కల్మేశ్వర్‌తో కలిసి మున్సిపల్ అధికారులతో సమావేశం నిర్వహించారు. చైర్‌పర్సన్ లావణ్య, డీసీపీ బస్వారెడ్డి, మున్సిపల్ కమిషనర్ రాజు, అధికారులు, కౌన్సిలర్లు పాల్గొన్నారు.

భీమ్‌గల్ మండల కేంద్రంలో మొగిలిచెరు కింద ముంపు ప్రాంతాన్ని బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డి పరిశీలించారు. మొగల్ చెరువు కింద మాటుకాలువ కబ్జాలకు గురైనందున చెరువు నుంచి వరదనీరు అయ్యప్పనగర్ తదితర ప్రాంతాల్లోకి వస్తోందని కాలనీవాసులు ఎమ్మెల్యేకు వివరించారు. ఎమ్మెల్యే స్పందించి స్థానిక తహసీల్దార్‌తో మాట్లాడారు. ఇరిగేషన్, రెవెన్యూ శాఖలు జాయింట్ సర్వే చేయించి మాటుకాలువ నిర్మించాలని ఆదేశించారు. కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు మానాల మోహన్‌రెడ్డి, రాష్ట్ర విత్త నాభివృద్ధి సంస్థ చైర్మన్ అన్వేశ్‌రెడ్డి, నాయకులు తాహెర్‌బిన్ హందాన్, ముత్యాల సునీల్‌కుమార్ తదితరులు ఉన్నారు.

రోగులకు మెరుగైన సేవలందించాలి

మహిళ ఆరోగ్య పరిస్థితిని తెలుసుకుంటున్న జిల్లా వైద్యాధికారి డాక్టర్ రాజశ్రీ

శక్కర్‌నగర్/ బోధన్ రూరల్, సెప్టెంబర్ 3: సీజనల్ వ్యాధులు ప్రబలుతున్న కారణంగా వైద్యులు, సిబ్బంది ప్రజలకు అందుబాటులో ఉంటూ రోగులకు సేవలందించాలని జిల్లా వైద్యాధికారి రాజశ్రీ అన్నారు. మంగళవారం బోధన్ పట్టణంలోని పాన్‌గల్లీ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని, సాలూరా మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని తనిఖీ చేశారు. రోగులతో మాట్లాడి సమస్యలు తెలుసుకున్నారు. ఆమె వెంట బోధన్ డిప్యూటీ డీఎంఅండ్‌హెచ్‌వో రాజుగౌడ్, పీహెచ్‌సీల వైద్యాధికారులు, సిబ్బంది ఉన్నారు.

బకాయిల వసూలుకు చర్యలు చేపట్టాలి

డీసీవో శ్రీనివాస్‌ను సన్మానిస్తున్న కార్యదర్శులు

శక్కర్‌నగర్, సెప్టెంబర్ 3: బోధన్ డివిజన్‌లోని సహకార సంఘాల్లో దీర్ఘకాలంగా బకాయి ఉన్న రుణాల వసూలుకు సహకార సంఘాల కార్యదర్శులు ప్రత్యేక చర్యలు చేపట్టాలని జిల్లా సహకార అధికారి శ్రీనివాస్ సూచించారు. మంగళవారం బోధన్ పట్టణంలోని సహకార సంఘ భవనంలో నిర్వహించిన కార్యదర్శుల సమావేశానికి పలువురు అధికారులు హాజరయ్యారు. జిల్లా అధికారి మాట్లాడుతూ.. వన్ టైం సెటిల్‌మెంట్ ద్వారా రుణ బకాయిలు వసూలు చేసేలా చర్యలు చేపట్టాలన్నారు. కార్యక్రమానికి హాజరైన అధికారులను సన్మానించారు. కార్యక్రమంలో జిల్లా సహకార సంఘాల బ్యాంకు మేనేజర్ లింబాద్రి, బోధన్ క్లస్టర్ అధికారి రవీందర్, బోధన్ సహకార బ్యాంకు బ్రాంచ్-1 మేనేజర్ ఖలీం, బ్రాంచ్-2 మేనేజర్ కిశోర్, క్లస్టర్ పరిధిలోని సహకార సంఘాల కార్యదర్శులు పాల్గొన్నారు.

తాళం వేసిన ఇంట్లో చోరీ

- 10 తులాల బంగారు నగలు, రూ.లక్ష నగదు అపహరణ

వినాయక్‌నగర్, సెప్టెంబర్ 3 : జిల్లాకేంద్రంలోని ఐదో టౌన్ పోలీస్‌స్టేషన్ పరిధిలో తాళం వేసిన ఓ ఇంట్లో దుండగులు చోరీకి పాల్పడ్డారు. ఎస్సై గంగాధర్ తెలిపిన వివరాల ప్రకారం.. బ్యాంక్ కాలనీలో నివాసం ఉండే శ్రీనివాస్ తన ఇంటికి తాళం వేసి కుటుంబీకులతో మూడు రోజుల క్రితం హైదరాబాద్‌కు వెళ్లాడు. సోమవారం రాత్రి దుండగులు చోరీకి పాల్పడి, బీరువాలోని 10 తులాల బంగారు నగలతో పాటు సుమారు రూ. లక్ష నగదును ఎత్తుకెళ్లారు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలాన్ని పరిశీలించారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

రుద్రూర్ మండలంలోని చిక్కడ్‌పల్లిలో ఎడ్ల పొలాల అమావాస్య పండుగను వీడీసీ ఆధ్వర్యంలో ట్రాక్టర్ యూనియన్ నాయకులు మంగళవారం నిర్వహించారు. నాలుగేండ్లుగా గ్రామంలో ఎడ్లు లేకపోవడంతో ట్రాక్టర్లను అలంకరించి, రైతులు హనుమాన్ ఆలయం చుట్టూ ప్రదక్షిణ చేయించారు.

– రుద్రూర్, సెప్టెంబర్ 3

మద్యం మత్తులో '100'కు కాల్ చేసిన వ్యక్తికి జైలు శిక్ష

వినాయక్‌నగర్, సెప్టెంబర్ 3 : మద్యం మత్తులో డయల్-100కు కాల్ చేసి, పోలీసులను తప్పుదోవ పట్టించిన వ్యక్తికి కోర్టు ఒక రోజు జైలు శిక్ష విధించింది. రెండో టౌన్ ఎస్సై యాసిర్ అరాఫత్ తెలిపిన వివరాల ప్రకారం.. నగరంలోని బాబన్‌సాబ్ పహాడ్‌కు చెందిన నదీం న్యాల్‌కల్ రోడ్డు ప్రాంతంలో ఓ వ్యక్తి నుంచి మొబైల్ ఫోన్ తీసుకొని డయల్-100కు కాల్ చేసి పోలీసుల అవసరం ఉందని చెప్పాడు. పోలీసులు ఘటనాస్థలానికి వెళ్లి ప్రశ్నించగా.. ఊరికే ఫోన్ చేసినట్లు మద్యం మత్తులో ఉన్న నదీం చెప్పాడు. దీంతో కేసు నమోదు చేసుకొని, స్టేషన్‌కు తరలించారు. సదరు వ్యక్తిని మంగళవారం కోర్టులో హాజరుపర్చగా ఒక రోజు జైలు శిక్ష విధిస్తూ స్పెషల్ జ్యుడీషియల్ సెకండ్ క్లాస్ మెజిస్ట్రేట్ తీర్పు వెల్లడించారు.

మరో రెండు రోజుల పాటు వర్షాలు..

ఖలీల్‌వాడి, సెప్టెంబర్ 3 : జిల్లాలో నాలుగు రోజులుగా పడుతున్న వర్షం.. మరో రెండు రోజుల పాటు కురియనున్నట్లు వాతావరణ శాఖ అధికారులు సూచించారు. ప్రజలు అవసరమైతే తప్ప బయటికి రావొద్దని సూచించారు. జిల్లావ్యాప్తంగా 15.1 మి.మీ. వర్షపాతం నమోదు కాగా.. ముప్కాల్‌లో అత్యధికంగా 45.5 మి.మీ., నవీపేట్‌లో 29.0, మెండోరాలో 28.2, సాలూరాలో అత్యల్పంగా 3.3 మి.మీ., మోపాల్‌లో 5.2, డిచ్‌పల్లిలో 7.6 మి.మీ. వర్షపాతం నమోదైనట్లు అధికారులు వివరించారు.

సంక్షిప్తంగా..

- **రేషన్‌కార్డు లేని రైతుల నుంచి దరఖాస్తుల స్వీకరణ** - కోటగిరి, సెప్టెంబర్ 3 : రేషన్ కార్డు లేని రైతుల నుంచి రుణమాఫీ కోసం దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు మండల వ్యవసాయాధికారి శ్రీనివాసరావు తెలిపారు. ఎంపీడీవో కార్యాలయంలో మంగళవారం ఆయన దరఖాస్తులను స్వీకరించారు. ఏఈవోలు గౌస్, ఆస్మా, ప్రశాంత్, సందీప్ పాల్గొన్నారు.
- **సేవాలాల్ సేన ఆధ్వర్యంలో సన్మానం** - కోటగిరి, సెప్టెంబర్ 3 : మండలంలోని దేవునిగుట్ట తండాలో ఉన్న సేవాలాల్ ఆలయంలో శ్రావణమాసం సందర్భంగా నెల రోజుల పాటు బంజారా సంస్కృతి, పాటలు, ఉపన్యాసం చేసిన వారికి సేవాలాల్ సేన ఆధ్వర్యంలో మంగళవారం సన్మానించారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు సీతారామనాయక్, ఉపాధ్యక్షుడు రవినాయక్, కోటగిరి మండల అధ్యక్షుడు తారాసింగ్ నాయక్, ఉపాధ్యక్షుడు కిషన్ నాయక్, ప్రధానకార్యదర్శి సురేశ్ నాయక్, సలహాదారులు నారాయణ, రమేశ్, పు